# అందరి చూపు దుబ్బాక ఫలితంపైనే..




దుబ్బాక మండలం పోతారంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డి (ఫైల్)

- ప్రతి నోటా.. బీఆర్ఎస్ మెజార్టీ మాట..
- బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలుపు ఖాయం
- కాంగ్రెస్, బీజేపీల్లో రెండో స్థానం ఎవరిదో..

దుబ్బాక, డిసెంబర్ 2 : దుబ్బాక నియోజకవర్గంలో భారీగా పోలింగ్ నమోదు అయినందుకు రాజకీయ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలోనే అత్యధికంగా దుబ్బాక నియోజకవర్గంలో పోలింగ్ నమోదు కావడం విశేషం. ఉద్యమాల గడ్డగా పేరొందిన 'దుబ్బాక' ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవడంలో మరోసారి సత్తా చాటారు. 2018 సార్వత్రిక ఎన్నికల్లో 85.92 శాతం పోలవ్వగా, 2020 ఉపఎన్నికల్లో 82.61 శాతం పోలింగ్ నమోదైంది. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో 87.51 శాతం పోలింగ్ నమోదు కావడం గమనార్హం. గత రెండు ఎన్నికలతో పోల్చితే ఈ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగింది. దుబ్బాక నియోజకవర్గంలో రెండు రోజులుగా రాజకీయ పరిణామాలపైనే సర్వత్రా ఉత్కంఠ కొనసాగుతున్నది. దుబ్బాక శాసనసభకు బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతోపాటు మొత్తం 11 మంది అభ్యర్థులు పోటీ చేశారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు త్రిముఖ పోటీ నెలకొంది. బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలుపు ఖాయమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే బీఆర్ఎస్‌కు ఎంత మెజార్టీ అనేది సర్వత్రా చర్చనీయంశంగా మారింది.

**అందరి నోటా.. బీఆర్ఎస్ మాట..**

ఈ ఎన్నికల్లో దుబ్బాక శాసనసభ గురించే చర్చ కొనసాగుతున్నది. నియోజకవర్గంలో బీఆర్ఎస్ తోపాటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పోటాపోటీగా ప్రచారం చేశాయి. 2020లో జరిగిన దుబ్బాక ఉపఎన్నికల్లో ఫలితాలు 20–20 మ్యాచ్‌ని తలపించింది. నువ్వా.. నేనా అంటూ బీఆర్ఎస్, బీజేపీ మధ్య పోటీ రసవత్తరంగా కొనసాగింది. చివరకు స్వల్ప మెజార్టీతో బీజేపీ అభ్యర్థి విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి నియోజకవర్గంలో మద్దతు భారీగా పెరిగింది. మెదక్ ఎంపీగా కొత్త ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషించారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి సౌమ్యుడు, మంచి నాయకుడిగా ప్రజల మన్ననలు పొందారు. ఎన్నికల ప్రచారంలో ఆయనపై జరిగిన హత్యాయత్నం సంఘటన నియోజకవర్గ ప్రజలను కలిచి వేసింది. ప్రభాకర్‌రెడ్డిపై అభిమానంతో




దుబ్బాక నియోజకవర్గ ముఖ చిత్రం

పట్టణాల్లో నివసించే నియోజకవర్గం ఓటర్లు పోలింగ్ రోజున వచ్చి ఓటేసి, తమ మద్దతు తెలిపారు. పోలింగ్ రోజు నుంచే నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలుపు పక్కాగా మారింది. పోలింగ్ ముగిసిన సమయం నుంచి ప్రతి నోటా బీఆర్ఎస్ మెజార్టీపైనే చర్చ కొనసాగుతున్నది. బీఆర్ఎస్ గెలుపు గురించి ఢోకా లేదని, మెజార్టీ ఎంత అనే అంశంపైనే చర్చ కొసాగుతున్నది. ఇకపోతే రెండో స్థానంలో బీజేపా, కాంగ్రెసా..? అంటూ ఆ పార్టీలకు ఎన్ని ఓట్లు పడే అవకాశం ఉంటుందన్న చర్చల్లో మునిగారు. 2018 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ రెండో స్థానం, బీజేపీ మూడవ స్థానంలో నిలిచాయి. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి డిపాజిట్ కూడా గల్లంతైనా విషయం తెల్సిందే. ఉప ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో బీజేపీ గెలిచింది.

**అత్యల్పం, అత్యధిక పోలింగ్ కేంద్రాలు..**

దుబ్బాక శాసనసభ ఎన్నికల్లో మొత్తం 1,98,100 మంది ఓటర్లున్నారు. ఇందులో 1.01,081 మంది మహిళలు, 97,019 మంది పురుషులున్నారు. ఇందుకు 253 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఎన్నికలు సజావుగా నిర్వహించారు. గత ఉప ఎన్నికతో పోల్చితే.. ఈ ఎన్నికల్లో 5 శాతం ఓటింగ్ పెరిగింది. ఈ ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గంలో చేగుంట మండలం బీమారావుపల్లి (220) పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా పోలింగ్ జరిగింది. ఈ పోలింగ్ కేంద్రంలో 363 మంది ఓటర్లకు 350 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 96.42 శాతంతో నియోజకవర్గంలో ప్రథమ స్థానంలో నిలిచి ప్రత్యేకత చాటుకున్నారు. దౌల్తాబాద్ మండలం లింగాయిపల్లి(138) పోలింగ్ కేంద్రంలో 451 మంది ఓటర్లకు 434 మంది ఓటేశారు. అక్బర్‌పేట–భూంపల్లి మండలం నగరం(25) పోలింగ్ కేంద్రంలో 412 మందికి 396 మంది ఓటేశారు. అత్యల్పంగా చేగుంట మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రం నెం. 228లో 62.30 శాతం పోలింగ్ నమోదైంది. ఈ కేంద్రంలో 1138 మంది ఓటర్లకు 709 మంది ఓటేశారు. 229 పోలింగ్ కేంద్రంలో 63.79 శాతం పోలింగ్ జరిగింది. ఈ కేంద్రంలో 1149 మంది ఓటర్లకు 733 మంది మాత్రమే ఓటేశారు. చేగుంటలో రెండు కేంద్రాల్లో అత్యల్పంగా పోలింగ్ నమోదైంది.


## కొత్త ప్రభాకర్‌రెడ్డికి భారీ మెజార్టీ ఖాయం



ఎంపీపీ పుష్పలత

దుబ్బాక, డిసెంబర్ 2 : బీఆర్ఎస్ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి ఘన విజయం సాధించడం ఖాయమని ఎంపీపీ కొత్త పుష్పలతాకిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం దుబ్బాకలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ దుబ్బాక గడ్డపై గులాబీ జెండా ఎగురనుందన్నారు. ఎన్నికల ఫలితాల్లో కొత్త ప్రభాకర్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. గత ఉపఎన్నికల్లో రఘునందన్‌రావు మాయమాటలకు మోసపోయి ప్రజలు గోస పడ్డారని తెలిపారు. ఈ ఎన్నికల్లో మాత్రం పని చేసే బీఆర్ఎస్ నాయకత్వాన్ని ప్రజలు కోరుకున్నారని చెప్పారు. ఎన్నికల్లో ప్రజలు ధర్మం వైపునే నిలిచి బీఆర్ఎస్‌ను గెలిపిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో హ్యాట్రిక్ సీఎం కేసీఆర్ పక్కా అని, దుబ్బాకలో కేపీఆర్ గెలుపు ఖాయమన్నారు.

## 'మల్లన్న'ను దర్శించుకున్న మాజీ డీజీపీ



మల్లన్న ఆలయంలో మాజీ డీజీపీ దినేశ్‌రెడ్డి

చేర్యాల, డిసెంబర్ 2 : కొమురవెల్లి శ్రీమల్లికార్జునస్వామిని శనివారం మాజీ డీజీపీ దినేశ్‌రెడ్డి దర్శించుకున్నారు. స్వామివారి ఆలయానికి వచ్చిన మాజీ డీజీపీకి ఆలయ వర్గాలు ఘనస్వాగతం పలికాయి. అనంతరం మాజీ డీజీపీ ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాజీ డీజీపీకి ఆశీర్వచనాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్సై నాగరాజు, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

## మధురమ్మ ట్రస్ట్ సేవలు అభినందనీయం



విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తదితరులు

హుస్నాబాద్ టౌన్, డిసెంబర్ 2 : గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ సేవలు అభినందనీయమని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ అన్నారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలోని మోడల్ స్కూల్, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్లు అందజేశారు. ఆయా పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 233 మంది విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లను ట్రస్ట్ నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ అందజేశారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.అన్నపూర్ణ, కేజీబీవీ ప్రత్యేకాధికారి మమత, బాలికల రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలిగించాలి

హుస్నాబాద్, డిసెంబర్ 2 : హుస్నాబాద్ పట్టణ శివారులోని పొట్లపల్లి రోడ్డులో గల తన మామిడితోటలో అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే తొలిగించాలని పట్టణానికి చెందిన రైతు ఎనగందుల లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో ట్రాన్స్‌కో అధికారులను కోరారు. నా అనుమతి లేకుండానే అధికారులు మామిడితోటలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారని, దీనిని మరో చోటికి మార్చాలని ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌తో పలుమార్లు మంటలు చెలరేగి మామిడి చెట్లు దగ్ధం అయ్యాయని, ఈ విషయంపై కూడా అధికారులు స్పందించడం లేదన్నారు. వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని, లేదంటే సబ్‌స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా తిరుపతి



తిరుపతి

బెజ్జంకి, డిసెంబర్ 2 : బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా గుండారం గ్రామానికి చెందిన బొడపట్ల తిరుపతి నియమితులయ్యారు. శనివారం గుండారంలో రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే రసమయి, ప్రజాప్రతినిధులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి, నాయకుడు దేవయ్య పాల్గొన్నారు.

## నేడే హుస్నాబాద్ ఎన్నికల ఫలితాలు

- సిద్దిపేటలోని ఇందూరు కళాశాలలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- హుస్నాబాద్ నియోజకవర్గం కౌంటింగ్‌కు 14 టేబుళ్లు, 22 రౌండ్లలో లెక్కింపు
- అభ్యర్థుల్లో నెలకొన్న ఉత్కంఠ

హుస్నాబాద్, డిసెంబర్ 2 : హుస్నాబాద్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నేడు వెలువడనున్నాయి. ఈనెల 30న జరిగిన పోలింగ్ అనంతరం ఈవీఎం మిషన్లను సిద్దిపేటలోని ఇందూరు కళాశాలకు తరలించి భద్రపరిచారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభమవుతుందని ఆర్వో బెన్ షాలోమ్ తెలిపారు. మూడంచెల భద్రత, సీసీ టీవీ కెమెరాల నిఘాలో ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 304 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంల కోసం 14 టేబుళ్లు వేసి మొత్తం 22 రౌండ్లలో కౌంటింగ్ పూర్తి చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం ప్రత్యేకంగా రెండు టేబుళ్లు కేటాయించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల ఫలితాలు ఉదయం 9.30 గంటలకు, మొదటి రౌండ్ ఫలితం ఉదయం 10.30 గంటలకు వెలువడే అవకాశం ఉంది. ఒక్కో టేబుల్ వద్ద ఒక్కో అబ్జర్వర్, ఎన్నికల అధికారులు, 19 మంది అభ్యర్థులకు సంబంధించిన కౌంటింగ్ ఏజెంట్లు ఉండేలా ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,42,177 మంది ఓటర్లు ఉండగా, 2,05,017 ఓట్లు (84.66 శాతం) పోలయ్యాయి. ఇందులో పురుషులు 1,01,937 మంది ఓటు వేయగా, 1,03,079మంది మహిళలు, ఇతరులు 1 ఓటు వేశారు. మధ్యాహ్నం వరకు గెలుపోటములు నిర్ధారణ అవుతాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల ముఖాముఖి పోటీ ఉండడం, పోలింగ్ సరళి కూడా ఫిఫ్టీ ఫిఫ్టీగా ఉండడంతో గెలుపుపై ఎవరి ధీమా వారిదే అన్నట్లు ఉంది. దీంతో అభ్యర్థుల తోపాటు వారి అనుచరులు,పార్టీ కార్యకర్తల్లో ఉత్కంఠ నెలకొంది.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కొమురవెల్లి, డిసెంబర్ 2 : కొమురవెల్లి మండల కేంద్రానికి చెందిన పొట్లచెరువు లక్ష్మణ్ శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ సార్ల లతాకిష్టయ్య శనివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. మరోవైపు బీఆర్ఎస్ యువ నాయకుడు గొల్లపల్లి ఆంజనేయులు మృతుడి కుటుంబానికి రూ.6 వేల ఆర్థిక సాయం అందజేశారు. సర్పంచ్ వెంట నాయకులు సార్ల సురేశ్, అన్నబోయిన రవీందర్, గజ్జె మురళి, పొట్లచెరువు శివయ్య తదితరులు ఉన్నారు.



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్